


# కుక్క పాట్లు

-పి.వి రామశర్మ

''చంటాడు అలా ఏడుస్తూంటే వినబడ్డలేదుటండీ! కాస్త ఎత్తుకోవచ్చు కదా?'' వంటింట్లోంచి అరిచింది రజని.

''వాడు పక్క తడిపి ఏడుస్తున్నాడు. అదేదో నువ్వే వచ్చి వాడి గుడ్డలు మార్చు. నా వల్లకాదు!'' అరిచాడు గడ్డం చేసుకుంటున్న సురేష్.

''నాకు చెయ్యి ఖాళీలేదండీ! మీకు మళ్ళీ కేరేజీ లేటయితే అంతెత్తున ఎగిరిపడతారు. కాస్త సాయం చెయ్యచ్చు కదా....ఒక్కసారి వాణ్ణి ఎత్తుకోండీ! పిల్లాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.'' వివరణా, నిరసనా, బ్రతిమిలాటా అన్నీ కలిపి చెప్పింది రజని.

''వాడికన్న అర్జంటు నాకీ టామీపని. దీన్ని ఇంకా బయటికి తీస్కెళ్ళలేదని ఇది ఇక్కడ నాకాళ్ళ దగ్గర చేరి ఒకటే గొడవ, గోల! లేటయితే మనకే ఇబ్బంది. టామీని తీస్కుని నే బయటకు వెళ్తున్నాగానీ నువ్వర్జంటుగా బాబుగాడి సంగతి చూసుకో.'' నిర్ణయం తీసుకున్నాను. నీ ఇష్టం అన్నట్టు తెగేసి చెప్పి, టామీ గొలుసు పట్టుకుని బయటకు నడిచాడు సురేష్.

''మొండి! శతమొండి! ఆయననుకున్నదే అయిపోవాలి!'' సణుక్కుంటున్న రజనిని చూసి, ఆమె తండ్రి దశరథరామయ్య కలుగజేసుకుంటూ ''పోన్లేఅమ్మా! పిల్లాడిని నే ఎత్తుకుంటాగానీ, నువ్వు పని తెములుచ్చుకుని తొందరగా రా!'' అని కూతురితో అంటూ,

''హు! ఏమిటో విచిత్రం! కన్న కొడుకుని ఎత్తుకుందికి, వాడి బట్టలు మార్చడం కన్నా, పెంపుడు కుక్కపిల్ల కాలకృత్యం చాలా అత్యవసరం అయిపోయింది. అవున్లే, అది గాని ఇంట్లో కాస్త పనీ కానిస్తే ఎవరు చేస్తారు'' అని మనసులో నవ్వుకున్నాడు.

★ ★ ★

ఆయన ఆ రోజు పొద్దుటే తన వూర్నించి వచ్చాడు. తన చిన్నకూతురి పెళ్ళికి అమ్మాయిని, అల్లుడిని స్వయంగా పిలిచి వెళ్దామని వచ్చాడు. పల్లెలోనే పుట్టి పెరిగిన దశరథరామయ్యకి ఇలా ఇంట్లో పెంపుడు జంతువుల్ని పెంచుకోవడం ఎందుకో ఇష్టం లేదు. ఆయన ఆ రోజు ఉదయం అల్లుడింటికి వస్తుంటేనే, వాకిట్లో మెళ్ళో గొలుసుతో అటూ ఇటూ తిరుగుతున్న టామీ కయ్ కయ్ మని ఆయన మీదకు వెళ్ళింది. ఆయన హడలిపోయి చేతిలో ఉన్న కర్రతో దాన్ని అదిలించే సరికి, అంతదూరం వెనక్కి పరిగెత్తి, అక్కణ్ణించే ఆయన్ని దాని భాషలో తిట్టసాగింది.

ఈ అలికిడికి ఇంట్లోంచి వచ్చిన, సురేష్, ''ఏయ్ టామీ! కీప్ క్వయిట్! ఎవరనుకున్నావ్! మామయ్యగారు! కమిన్! కమిన్!! అని దాన్ని పిలుస్తూ, ''రండి మామయ్యగారూ! అదేం చెయ్యదు'' అంటూ మామగార్ని ఆహ్వానించాడు.

ఛీ ఛీ! దరిద్రపు సంత! అవి మనసులో గొణుక్కుని దూరంగా జరిగాడు బయటికి అంటే అల్లుడు బాధపడతాడని అల్లుడికి అదంటే బాగా ఇష్టమని ఆయనకి అర్థమైపోయింది.

★ ★ ★

టామీని, దాని కాలకృత్యాలు దగ్గరుండి కానిచ్చి, తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు సురేష్.

'6ఇప్పుడు చూసారా మామయ్యా! దాని మొహంలో ఎంత రిలీఫ్ ఉందో!'' అన్నాడు దానిని ఎత్తుకుని చూపిస్తూ!

''నా బొంద! దాని మొహంలో ఏం ఖర్మ! మన మొహాల్లో కూడా ఆ పని కానిచ్చుకోగానే రిలీఫ్ వస్తాయి'' అనుకున్నాడు దశరథరామయ్య, కూతురిచ్చిన టిఫిన్ తింటూ.

కాని ఆయన్ని చూస్తూనే టామీ మళ్ళీ అరవడం మొదలెట్టడంతో మళ్ళీ ఏం జరిగిందో, ఇంతలోనే దానికి కొత్త అయిపోయి, మళ్ళీ నీ మామయ్యనే అని పరిచయం చేసుకోవాలేమో తెలీక అయోమయం అయిపోయి ''మళ్ళీ ఎందుకరుస్తోందల్లుడూ!''...అదేదే జోక్‌లాగా, దాని ప్లేట్లో గానీ నేను ఈ టిఫిన్ తినడం లేదుకదా!'' అన్నాడు.

దానికి పగలబడి నవ్వుతూ..''మీరు సగం కరెక్ట్ మామయ్యగారూ! టిఫిన్ ప్లేటు కాదుగానీ...మీరు కూర్చున్న ఆ కుర్చీలో అది తరచూ ఎగిరి కూర్చుని అప్పుడప్పుడు మాతోపాటు టీవీ కూడా చూస్తుంది. దానికి గాయత్రి సీరియల్ టైటిల్ సాంగంటే ఎంతిష్టమో! ఎక్కడున్నా ఆ టైంకి వచ్చి ఆ కుర్చీలో కూర్చుటాడు'' ఇప్పుడు మీరు తన సీటు ఆక్రమించారని దాని ఉక్రోషం!'' అన్నాడు సురేష్!

''వార్నీ! సీరియల్స్ పిచ్చి మనుషులకే కాదు, కుక్కలకి కూడా పట్టిందన్నమాట! సర్సరే! దాని సీటు నాకెందుకు. దీన్ని ఇప్పటికి ఎన్నిసార్లు తడిపిందో ఏమో! ఖర్మ!'' అని అనుకుంటూ లేచి పక్క సోఫాలో కూర్చున్నాడు దశరథరామయ్య.

''ఆ! ఇంతకీ విశేషాలేంటి మామయ్యగారూ? రంజిత పెళ్ళి పనులెంత వరకు వచ్చాయ్?'' అనడిగాడు సురేష్. రంజిత దశరథరామయ్య చిన్నకూతురు. ఇంకో పదిహేను రోజుల్లో పెళ్ళి ఆ అమ్మాయికి.''

''ఆ పనిమీదే వచ్చాను అల్లుడూ! మీ ఇద్దరూ పెళ్ళికి ఓ వారం, పది రోజుల ముందే రావాల్సిందే తప్పనిసరిగా. నీ సహాయం నాకెంతో అవసరం! అందుకే స్వయంగా పిలిచి వెళదామని వచ్చాను. అలాగే బజార్లో కొంచెం పన్లున్నాయ్. నీకెపుడు ఖాళీనో చెబితే...వెళ్ళి చేసుకొద్దాం!'' అన్నాడు దశరథరామయ్య.''

''సరే! అలాగేలెండి!'' అన్నాడు. ఆఫీస్‌కి రెడీ అవుతూ సురేష్.

అల్లుడు ఆఫీసుకి వెళ్ళిన తరువాత, కూతుర్నడిగాడు. ఈ కుక్కపిల్లనెప్పుడు తెచ్చుకున్నారని ఆయనకి తెలుసు. కూతురికి కూడా వాటిని పెంచుకోవడం ఇష్టం లేదు. మన ఇంటిని అవి సంరక్షించే మాట ఎలా ఉన్నా, మనం ఆదమరిచి ఉన్నప్పుడో, నిద్రపోతున్నప్పుడు ఎవరైనా వచ్చి కాలింగ్ బెల్ మోగిస్తేనో, ఇంకే చప్పుళ్ళయినా...అవి అరిచే అరుపులకి గుండెలవిసిపోతాయి. హార్ట్ పేషెంట్స్ ఎవరన్నా ఉంటే...అంతే సంగతులు!

'' నా కిష్టం లేదని నీకు తెలుసుగా నాన్నా! ఆయనకి ఎప్పటి నుండో పెంచుకోవాలని కోరికట. పెళ్ళి కాక ముందు ఆయనకవంటే అంత ఇష్టం ఉండేది కాదు. కాని తరచూ తన స్నేహితుల ఇళ్ళలో చూసి, ...సి క్రమేపీ ఆయనకిష్టమైందిట. పెళ్ళయిన కొత్తల్లో అ...ు. నేనొద్దన్నాను. హాయిగా మనిద్దరం సరదాగా తిరిగి ఎంజాయ్ చెయ్యకుండా ఈ శునకానందమేమిటని. ఊరుకున్నారు. ఇదిగో ఈ చంటాడు పుట్టాక, నేను వాడితో బిజీ అయిపోయాను కదా! మళ్ళీ కుక్కబుద్ధి, అదే కుక్కని పెంచుకోవాలనే బుద్ధి పుట్టింది. ఈలోగా ఆయన స్నేహితుడొకరు వాళ్ళింట్లో పుట్టిందని, చాలా మంచి జాతి అని దీని చిన్నప్పుడే ఈయన కంటగట్టాడు. సరే! ఇంక కుక్కకోసం ''కుక్కజట్టీలు'' ఇంట్లో ఎందుకని ఊరుకున్నాను'' అని చెప్పింది రజని.

★ ★ ★

సాయంత్రం ఆఫీసు నుండి సురేష్ వచ్చీ రావడంతోనే, టామీ అతని మీదకెగిరి, నాలికతో మొహం, చేతులు నాకేస్తూ నానా హడావుడీ చేసింది.

''ఓరి! ఓరి! టామీలూ! ఎంత ప్రేమే నేనంటే! నన్నొదిలి ఉండలేకపోయావా ఈ కాసేపూ!'' అంటూ సురేష్ కూడా దాన్ని ముద్దాడుతూ హడావుడి చేసాడు.

మంచంలో పడుకుని, కాళ్ళూ చేతులు టపటప కొడుతూ కేరింతలు పెడుతున్న చంటివాడి హడావుడి ఈ టామీ అరుపులో సురేష్‌కి వినబడలేదు.

''సర్సరే! చంటాడ్ని చూడండీ! మిమ్మ...సి ఎల కేరింతలు కొడుతున్నాడో? టామీ పాటి చెయ్యలేకపోయాడా వాడు! అని ఉడుక్కుంది రజని.

కాళ్ళు చేతులు కడుక్కొచ్చి, చంటాడ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని వాణ్ణి ముద్దాడుతున్నాడు సురేష్. టామీ కుయ్! కుయ్ మని సురేష్ చుట్టూ తిరుగుతూ హడావుడి చేస్తోంది.

''ఏంట్రా! టామీలూ! తమ్ముణ్ణెత్తుకుని నిన్నొదిలేసేనా రా! రా!! నిన్నూ ఎత్తుకుంటా!'' అంటూ దాన్ని కూడా ఒళ్లోకి లాక్కున్నాడు సురేష్. ''చూసారా మామయ్యా దాన్ని వదిలి బాబునెత్తుకున్నాని దాని బాధ'' అన్నాడు దాని భావాలు తనకు తెలుసన్నట్టుగా.

''వరసలు బావున్నాయ్! నువ్వు నాన్నవి. నీ కొడుకు దానికి తమ్ముడు. నేను దానికి మామయ్యని!... అయినా జాగ్రత్త బాబూ! చంటాడికి ఎవన్నా ఇన్‌ఫెక్షన్స్ రాగలవు అది కరిచినా ప్రమాదం. దాన్ని దింపెయ్ కూడదూ! అన్నాడు భయంగా.

''ఏం, ఫర్లేదు మామయ్యగారూ! టామీకి ఇంజక్షన్ చేయించేసా!'' అది పొరపాట్న ఎవర్ని కలిచినా ఏమవదు అన్నాడు సురేష్.

అయినా తన భయం తనది. ఎలా చెప్పాలో తెలీక మౌనం వహించాడు దశరథరామయ్య.

★ ★ ★

ఒక రెండ్రోజులు వీలు చూసుకుని, మామగారితో షాపింగ్ పూర్తి చేసాడు సురేష్. ఆయన ఇంక బయల్దేరతానంటే మర్నాడు ఆదివారమే కదా ఉండమని, సరదాగా ఊర్లో తిరిగొద్దామనీ ఆయనని ఆపేసాడు. టామీని తీసుకొచ్చాక, ఇప్పటి దాకా బయటికి అందరూ ఇల్లు తాళం పెట్టి వెళ్ళే పరిస్థితి రాలేదు. ఇప్పుడు బయటకెళ్ళాలంటే టామీని కూడా తీసుకెళ్ళాలి. లేదా దాన్ని ఇంట్లో వదిలేసి వెళ్ళాలి. సరే ఓ రెండు మూడు గంటల్లో వచ్చేద్దామని దాన్ని వరండాలో కట్టేసి, దానిక్కావలసినవి ఎరేంజ్ చేసి వెళ్ళారు.

ఇంటికి వచ్చి చూసేసరికి వరండాలో అందంగా అమర్చిన పూలకుండీలన్నీ పగిలిపోయి ఉన్నాయి. ఓ మూల ఒద్దికగా పెట్టిన జోళ్ళస్టాండ్‌లోని జోళ్ళు, బూట్లు, సాక్సులు చిందర వందరగా పడి ఉన్నాయి. టామీ ఓ మూల కుయ్ కుయ్ మని అరుస్తూ కూర్చుంది. దాని మెడనున్న గొలుసు వరండాలోని స్తంభం చుట్టూ చుట్టుకుపోయి [illegible]లుపడి, టామీని ఓ అంగుళం కూడా ముందుకు కదలలేని విధంగా చిక్కులుపడి ఉంది.

దాన్ని గొలుసు ముళ్ళ నుండి విడిపించి, పూలకుండీల్లోని పూలమొక్కలని మళ్ళీ బయట మట్టిలో అందాకా నాటి, అన్నీ శుభ్రం చేసుకునే సరికి సురేష్ దంపతులకి తల ప్రాణం తోకకు వచ్చింది. ఇంకా నయం! ఇంట్లో కట్టేసి వెళ్ళుంటే ఇంకెన్ని వస్తువులు పాడు చేసుండేదో...పూలకుండీలతో సరిపోయింది అనుకున్నాడు సురేష్.

అప్పుడనిపించింది! ఇంట్లో పెట్‌డాగ్స్‌ని గాని ఇంక ఏ పెంపుడు జంతువులు, పక్షులనైనాగానీ చూసుకుందికి ఒక రెగ్యులర్ అటెండెంట్ అవసరమని.

★ ★ ★

రజనీ చెల్లెలి పెళ్ళి కెళ్ళాల్సిన రోజు దగ్గర పడుతోంది. టామీని ఎక్కడ ఉంచడం అన్నది ఓ సమస్య అయింది. మామగారితో అప్పుడు బయటికెళ్ళొచ్చిన సంఘటన తరువాత, ఈ మధ్యన అర్జంటుగా మార్కెట్ కెళ్ళాల్సొచ్చి, పక్కింటివాళ్ళని బ్రతిమాలి వాళ్ళింట్లో టామీని వదిలి వెళ్ళారు. అప్పుడంటే ఒక మూడుగంటల్లో తిరిగొచ్చేసారు. ఆ పాటికే టామీ వాళ్ళింటి వాళ్ళందరి చెవులు చిల్లులు చేసేసింది దాని అరుపులతో. ఈసారి వాళ్ళనడిగితే...గత అనుభవం గ[illegible] ఉంచుకోమన్నారు. అదీకాక వారం రోజులంటే అసలె కుదరదు. దాని ఆలనా పాలన మా వల్ల కాదని అన్నారు. పోనీ, టామీని దాన్ని తమకిచ్చిన స్నేహితుండింట ఉంచుదామంటే ఆయన క్రిందటి నెలే ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయాడు.

సరే! టామీ తీస్కునే ఊరు బయలుదేరుదాం అని నిశ్చయించుకున్నారు. తీరా బస్టాండ్ చేరి, బస్ ఎక్కబోతుంటే, కండక్టర్ వారించాడు. కుక్కని ఎక్కించుకోనన్నాడు.

ఏమయ్యా! కోళ్ళని, గొర్రెల్ని ఎక్కించుకుంటే లేదుగానీ, నా టామీని ఎక్కించుకోవడానికేం? చూడెంత ముద్దొస్తోందో బుజ్జిముండ! ఓసారి ఎత్తుకుచూడు!'' అని టామీని కండక్టర్ వళ్ళో పడేసాడు.

కండక్టర్ కుక్క కరిచిన వాడిలా అరిచి, ''తీసేయ్! తీసేయ్ దాన్ని ముందు! ఏయ్ ఛీ!ఛీ! పో! పో! అంటూ కుక్కని, దాని ఓనర్‌ని ఇద్దర్నీ దిగండి ముందు! నేనా కుక్కని తీస్కెళ్ళను గాక తీస్కెళ్ళను!'' అని సద్దాం హుస్సేన్‌లా మొహం పెట్టి భీష్మించుక్కూర్చున్నాడు.

''అసలు దీన్ని కుక్కని ఎవడన్నాడయ్యా!'' పక్కనున్న ఊర కుక్కని చూపిస్తూ, ''అదీ కుక్కంటే! ఇది పెట్‌డాగ్! టామీ! దీనిపేరు'' ''బాబ్బాబు! నాకింకో దారి లేదు! దీన్ని నాతో తీస్కెళ్ళక తప్పదు! కావాలంటే దీనిక్కూడా ఫుల్ టికెట్ కొట్టు. సీటు అడక్కుండా దీన్ని నా ఒళ్ళోనే కూర్చోపెట్టుకుంటాను'' అని బ్రతిమిలాడాడు సురేష్.

ఈలోగా డ్రైవరు ఇదంతా గమనించి, బస్ టైం కూడా అయిపోతుండడంతో, కండక్టరును పిలిచి గుసగుసలాడాడు.

కండక్టరు తిరిగొచ్చి, సంధికొచ్చిన ముషారఫ్‌లా 'రఫ్'గా ముఖం పెట్టి, ''ఆ ఫుల్ టికెట్ డబ్బులేవో ఇలా ఇవ్వండి!'' కానీ టికెట్ కొట్టను! ఎవడేనా చెకింగ్ కొస్తే, దాన్ని కనబడకుండా, అరవకుండా దాచాల్సిన బాధ్యత మేదే!'' అని సంధి షరతులు ఏకరువు పెట్టాడు.

పరిస్థితి ఇంకా అధ్వాన్నం కాకముందే అద్వానీలా ముఖం పెట్టి, ''టీక్ హై! టీక్‌హై!'' అని టామీతో సహా బస్‌లోకి జొరబడి, సీట్ల కోసం వెతుకులాడారు సురేష్, రజని. రెండు విడి విడి సీట్లు దొరికాయ్. వాళ్ళని ఒక సీటులోకి మారి, తమకి ఏకంగా రెండు సీట్లు పక్కపక్కని ఇమ్మంటే, కిటికీలు వదలంగాక వదలం! అందువల్ల అలా కుదరదు పొమ్మన్నారు వాళ్ళు. ఈలోగా బస్ బయలుదేరింది.

టామీ ఇంకా కుదురుగా కూర్చోక, ముందు సీట్లో వాళ్ళ బుర్రల్ని గోకడం, జుత్తు పీకడం లాంటివి చేస్తుండడంతో...దాన్ని కిటికీ వేపు తిప్పి బుర్ర బయట పెట్టి చూస్తుండేలా సర్దుబాటు చేసుకున్నాడు సురేష్.

చేసేది లేక ముందు, వెనుక సీట్లలో సర్దుకున్నారు సురేష్, రజని, సురేష్ టామీని తన ఒళ్ళో ఒద్దికగా కూర్చోబెట్టుకున్నాడు. టామీ పక్కసీట్లో ఉన్నతన్ని గుర్రుగా చూస్తూ, అతని చేతుల్ని వాసన చూస్తూ, నాకుతూ, అప్పుడప్పుడు మొహం మీదికి నాలుక పోనిచ్చి అతన్ని రుచి చూడడం మొదలెట్టింది. అలా రెండు మూడు సార్లు నాకించుకున్నాక, ఇక అతని వల్ల కాక, సురేష్‌కి, టామీకి నమస్కారాలు పెట్టి, రజనీని ఆ సీట్లోకి రమ్మని, రజని కూర్చున్న సీట్లోకి మారిపోయాడతడు కిటికీ సీటుని త్యాగం చేస్తూ!

ఓహో! కుక్కల వల్ల బస్ ఎక్కడం కష్టమే కాకుండా, ఒక వేళ ఎక్కితే, సీట్లు బాగా సర్దుబాటు అవుతాయన్నమాట! థాంక్యూ టామీ! అనుకుని హాపీగా పక్కపక్క సీట్లలో సెటిలయ్యారు సురేష్, రజని, చంటాడు.

టామీ ఇంకా కుదురుగా కూర్చోక, ముందు సీట్లో వాళ్ళ బుర్రల్ని గోకడం, జుత్తు పీకడం లాంటివి చేస్తుండడంతో...దాన్ని కిటికీ వేపు తిప్పి బుర్ర బయట పెట్టి చూస్తుండేలా సర్దుబాటు చేసుకున్నాడు సురేష్.

ఓ పదినిమిషాలు గడిచిందో లేదో బస్ డ్రైవర్ సడెన్‌గా బస్సాపి ''ఏమండోయ్! మీ కుక్క మొహం కాస్త లోపలికి పెడతారా!'' అనరిచాడు సురేష్‌ని వెనక్కి తిరిగి చూస్తూ!

''ఆయ్! మర్యాదగా మాట్లాడు! నాది కుక్కమొహం అంటావా!'' అని గయ్‌మన్నాడు సురేష్?

''అబ్బ! మీ మొహం కాదండీ! మీ కుక్క మొహం!...అదే మీ కుక్కపిల్ల బుర్ర బయటికి పెట్టి చూస్తోంది! దాన్ని లోపలికి లాగండి!'' అని మళ్ళీ అరిచాడు.

''ఓహ్! సారీ!'' అంటూ టామీని వెనక్కి లాగి, ఒళ్ళో కుదురుగా కూర్చోబెట్టుకున్నాడు. దాన్ని అనేక విధాల సముదాయిస్తూ, నానా అవస్థపడుతూ, మనసులో విసుక్కుంటూ కూర్చున్నాడు సురేష్. పక్కసీట్లో హాయిగా రజనీ, ఒళ్లో బాబు నిద్రపోతున్నారు. ఈ కుక్కముండ కుదురుగా ఉండదూ, నన్ను పడుకోనివ్వదూ! అని మొదటి సారి కుక్కమీద విసుక్కున్నాడు. దాన్ని 'టామీ' అనే పిలవాలన్నది మర్చిపోయి.

మొత్తం మీద ఓ మూడు గంటలు గడిచింది, బయల్దేరి. ఇంకో గంట పోతేగానీ సురేష్ దిగాల్సిన ఊరు రాదు. ఈలోగా టామీకి లఘుశంక అవసరం వచ్చింది కాబోలు నానా గలాటా మొదలెట్టింది. దాని అరుపులకి బస్సులో ఉన్నవాళ్ళందరికీ రాను రానూ సహనం నశించి, చివరికి సురేష్‌ని, అతన్నెక్కించిన కండక్టర్‌ని విసుక్కోవడం మొదలెట్టారు.

సురేష్‌కి కూడా చాలా చిరాకనిపించి, డ్రైవర్‌ని బస్సాపమన్నాడు. ''ఎటూ కాని చోట ఇప్పుడు బస్సాపడం దేనికి? ఇంకో అయిదు కిలోమీటర్లు పోతే నెక్స్ట్ స్టేజ్ వస్తుంది! అక్కడాపుతాను కదా'' అన్నాడు డ్రైవర్.

టామీకి లఘశంక తీర్చాలి. అందుకే దాని గోల, దాని గోల తగ్గించడం కోసం బస్‌లో వాళ్ళ గోల. అందరి గోల తగ్గాలంటే బస్ ఆపు! లేపోతే మానేయ్'' అన్నాడు సురేష్.

మిగతా ప్రయాణికులు కూడా, నాయనా డ్రైవరూ! బస్సాపవయ్యా! దీనిగోల భరించలేక ఛస్తున్నాం! అని అనడంతో విసుక్కుంటూ బస్సాపాడు డ్రైవర్.

సురేష్ టామీని గొలుసుతో సహా పట్టుకొని జాగ్రత్తగా బస్‌లోంచి దిగాడు. దిగీ దిగడంతోనే, చెంగున సురేష్ చేతుల్లోంచి టామీ క్రిందకి దూకింది. ఆ స్పీడ్‌కి దాని మెళ్లో గొలుసు లింక్ తప్పి, గొలుసు సురేష్ చేతికి మిగిలి, టామీ పరుగు లంకించుకుంది.

''ఏయ్! టామీ! స్టాప్! స్టాప్‌దేర్!! ఆగు! రైరో!! అని అన్ని భాషల్లోనూ అరుస్తూ దాని వెంటపడ్డాడు.

అది కొంత దూరం పోయి, చెట్టు, గట్టూ, మట్టీ అన్నీ వాసన చూస్తూ, చివరికి దానికి నచ్చిన చోట లఘుశంక తీర్చుకుని, మళ్ళీ విహారం మొదలెట్టింది. దాని వెంట సురేష్‌పడ్డాడు.

ఈ వినోదం చూస్తూ కొందరు నవ్వుకుంటే, ఆఫ్టరాల్ కుక్కకోసం బస్సాపగా లేంది, మన అనుమానాలు తీర్చుకుంటే ఏం అనుకుని కొంత మంది బస్‌దిగి ఎదురుగా ఉన్న చెట్లచాటుకి పోయారు. డ్రైవరు, కండక్టరు దిగొద్దు టైం లేదని అరుస్తున్నా వినకుండా.

మొత్తానికి ఒక పదినిమిషాల ప్రయాస తరువాత టామీని దొరకబుచ్చుకుని బస్సెక్కాడు సురేష్. పాపం! ఒళ్ళంతా చెమటలు పట్టి షర్టంతా తడిసిపోయింది. కుక్క శంక వలన తన లఘుశంక కూడా మర్చిపోయాడు. ఇప్పుడుగాని మళ్ళీ అడిగితే, కండక్టరు ఎన్‌కౌంటర్ చేసి చంపినా చంపేస్తాడని ఊరుకున్నాడు.

''సార్! ఇకపైన ఇలా కుక్కల్ని వెంట బెట్టుకుని రాకండి సార్! మధ్య మా చావుకొస్తోంది!'' అని కండక్టర్ మరోమారు సురేష్ పైన విసుక్కుని రైట్ చెప్పాడు.

బాగా విసిగిపోయిన సురేష్ కూడా, దాన్ని కదలనీయకుండా ఒళ్ళో కుదురుగా కూర్చోబెట్టుకున్నాడు. అది కూడా లఘుశంక తీర్చుకున్న ఆనందంతో 'ఓ వాటే రిలీఫ్!' అన్నట్లు హేపీగా నిద్రపోయింది.


★ ★ ★

ఎలాగైతేనేం మాంగారి ఊర్లో బస్‌దిగి బతుకు జీవుడా అనుకున్నాడు. ఈసారి కూడా బస్ దిగి దిగగానే కిందకి

(మిగతా 29వ పేజీలో)

# పదచదరంగం-16

కూర్పు: ఎన్.పార్థసారధి



## ఆధారాలు

**అడ్డం**

1.పరధ్యానంగా

5.అశ్వారోహకుల ఆసనం

6.జీవికి ముగింపు

7.ఆదాము భార్య వెనుదిరిగింది

11.అగస్త్య మహాముని ఇల్లాలు

12.సంతాన లేమి

14.కుంభకర్ణుడు కోరిన వరం

15.దీక్షితం లేని సినీనటి

16.రుక్మిణి ముద్దు పేరు

19.శ్రీ వేంకటేశ్వరుని నివాస స్థలం

**నిలువు**

1.లేడి

2.నెత్తురు

3.పడవ తిరగబడింది

4.తామర రేకుల వంటి కన్నులు కలది

8.నిజాలు కాని మాటలు

9.ఈ ఇంధనం ధరలు పెరుగుతూనే ఉన్నాయి

10.దేవతావేశం

13.సినీతారే కాదు మద్యాన్ని అందించే చిన్నది

17.అందం

18.ఇక్కడ సర్వం. శ్రీ జగన్నాథం

**పదచదరంగం-15 సమాధానాలు:**

**అడ్డం**

1.పరుసవేది

4.విధి

5.ఆగామి

6.భువి

10.విరహము

11.విలవిల

13.దండు

14.శిబువు

15.దండి

18.పాదరసము

**నిలువు**

1.పస్తు

2.సరాగాలు

3.దివి

4.విప్ర వినోదం

7.విచ్చులవిడి

8.కాహళి

9.పిలక

12.శింశుమార

16.పీపా

17.జాము

(9వ పేజీ తరువాయి)

గెంతిన టామీ, వెంటనే ఓ ఆర్తనాదం చేసి సురేష్ కాళ్ళ మధ్యన దాక్కుండి వణికిపోతూ...కారణం ఓ రెండు బస్టాండ్ ఆస్థాన శునకాలు కోరలు బయట పెట్టి క్రూరంగా చూస్తూ టామీ మీదకి అవకాశం దొరికితే దూకడానికి సిద్ధంగా ఉన్నాయ్. వాటి బారి నుండి టామీని రక్షించడానికి, దాన్నెత్తుకుని ముందుకు నడిచాడు. రిక్షా మాట్లాడి దాంట్లో చేరి బయల్దేరారు ఇంటికి కొంత దూరం వెంబడించి, ఇంక అవకాశం లేకపోవడంతో "నెక్స్ట్ టైం బెటర్ లక్" అనుకుంటూ వెనుదిరిగాయి ఆస్థాన శునకాలు. మామగారి ఇంటికి చేరుతూనే ఆ ఇంటి కాంపౌండ్ లోపల టామీని వదిలేసాడు "ఉంటే ఉండు! పోతే పో!" అన్నట్టుగా.

అదేమిటండీ! దానిని అలా వదిలేసారు! కట్టేయ లేకపోయారా? మళ్ళీ ఏ ఊరకుక్కో వెంటబడితే!" అంది రజని.

"అమ్మో! ఇక నావల్ల కాదు! అసలీ పెళ్ళి నాల్రోజులు కూడా నేను దాని వెంట పరిగెట్టడం, దాని అవసరాలు చూడ్డానికే అయిపోయేట్టుంది. దీన్నిక్కడే వదిలేసి పోదాం. మళ్ళీ దీన్ని వెనక్కి తీసుకెళ్ళాలంటే ఏ టాక్సీనో చేయించుకు వెళ్ళాలి తప్ప. ఈ బస్‌లో గోల నేను పడలేను" అంటూ అప్పుడే పలకరించడానికి వచ్చిన పెళ్ళి కూతుర్ని చూస్తూ! ఏదో అయిడియా వచ్చిన వాడిలా, "హాయ్! మరదలుపిల్లా! కంగ్రాట్స్! అన్నట్లు నీ పెళ్ళికి నాదొక మంచి ప్రెజంటేషన్. లైవ్ లీ అండ్ లవ్ లీ ప్రెజంటేషన్ ఉండు ఇప్పుడే ఇచ్చేస్తా! లేటయితే కష్టం!! అంటూ పెరట్లోకి పరిగెట్టి టామీని తీసుకొచ్చి, రంజిత చేతుల్లో పెడుతూ " ఇదే నా ప్రెజంటేషన్" అన్నాడు నవ్వుతూ.

"ఇదేం ప్రెజంటేషన్ బావా! మరీనూ! అయినా దీన్ని నాకిచ్చేస్తున్నావేంటి! నీకో!" అంది రంజిత ఆశ్చర్యంగా.

అది కాదే చెల్లీ! అంటూ టామీని తీసుకురావడంలో దారంటూ సురేష్ పడ్డ పాట్లు చెప్పింది రజని నవ్వుతూ!"

"అయితే బావా! అందరూ అంటుంటారు కదా! "కష్టమైన పని ఏదన్నా చేసి "కుక్కపాట్లు" పడ్డాం అని! అయితే నువ్వు నిజంగా "కుక్క (తో) పాట్లు" పడ్డావన్న మాట." అని రంజిత అనే సరికి అందరూ గొల్లుమన్నారు. ★